**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 12.10.2024 సమయం 1810 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఈ సాయంత్రం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.**

**2. పామాయిల్ కు టన్ను ధర 20 వేల రూపాయలు ఉండేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.**

**3. వచ్చే ఐదేళ్ళల్లో రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి దిశగా కసరత్తు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.**

**4. రెండు తెలుగు రాష్ట్రాలలో విజయదశమి పండుగను ఆనందంగా భక్తి శ్రద్దలతో జరుపుకుంటున్నారు.**

**5.ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ రాత్రి 7 గంటలకు జరిగే మూడవ, చివరి టీ-20 మ్యాచ్ లో భారత్ – బంగ్లాదేశ్ జట్లు తలపడతాయి**

సీఎం

-నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిని ఈ వేళ సందర్శించారు. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి గ్రామానికి వచ్చిన ఆయనకు బోనాలు, బతుకమ్మలతో ఘనస్వాగతం లభించింది. గ్రామంలో 21కోట్ల 39 లక్షల

రూపాయల విలుగల  అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. లోక్ సభ సభ్యుడు మల్లురవి, ఎమ్మెల్యేలు వంశీక్రిష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ రాజేష్ రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

--పీటీసీ, నాగర్ కర్నూలు

తుమ్మల-పామాయిల్

పామాయిల్ కు మంచి ధర వచ్చేలా చూస్తామని, టన్ను ధర 20 వేల రూపాయలు ఉండేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ విషయమై అవసరమైతే రాష్ట్రాల అధినేతలతో కలిసి కేంద్రం దగ్గరకి వెళతామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పామాయిల్ కర్మాగారంలో 2.5 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ ప్లాంట్ ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... 1986లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పశ్చిమ గోదావరి జిల్లా పామాయిల్ మొక్క నాటారని, మరో నాలుగేళ్లకు... 1990 తర్వాత  ఈ సాగు తెలంగాణకు  విస్తరించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో పామాయిల్ సాగుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. కొత్తగూడెం జిల్లాలో పట్టా బదలాయింపులు ఉండవు గనుక భూమి ఉన్న ప్రతి రైతుకు పామాయిల్ మొక్క అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రిని కోరారు. డిసెంబర్ 9వ తేదిలోగా రుణమాపి ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం

చేశారు. ఇచ్చిన మాట మాట ప్రకారం రైతు భరోసా ఇచ్చే ఏర్పాటు చేశామని. పంట భీమా పథకాన్ని కూడా అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి హామీ ఇచ్చారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రపంచం మొత్తం థర్మల్ పవర్ నుండి గ్రీన్ పవర్ వైపుగా అడుగు లు వేస్తోందని, వచ్చే ఐదేళ్ళల్లో రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి దిశగా కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు.. దిగుమతి సుంకాన్ని 28 శాతానికి పెంచి మన పామాయిల్ కు మద్దతు ధర దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులకు పంట భీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని  ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

--పీటీసీ...భద్రాద్రి కొత్తగూడెం

విజయదశమి

రెండు తెలుగు  రాష్ట్రాలలో విజయదశమి పండుగను ఆనందంగా భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఆయుధపూజ,శమీ పూజ నిర్వహించారు. అన్ని ఆలయాలు, ముఖ్యంగా దేవీ ఆలయాల వద్దవ వేకువ జాము నుంచే భక్తులు బారులుదీరారు. శరన్నవరాత్రుల చివరి రోజైన నేడు అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. కేంద్ర మంత్రి  కిషన్ రెడ్డి హైదరాబాద్ లోని పలు ఆలయాలలో కుటుంబ సమేతంగా  ప్రత్యేక  పూజలు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో  ప్రత్యేక పూజ, శమీపూజ నిర్వహించారు.

ఈ సాయంత్రం  హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో  టీ-20 మ్యాచ్ ఆడవలసిన  తెలుగు ఆటగాళ్లు  తిలక్ వర్మ,  నితిశ్ కుమార్ రెడ్డి  జూబ్లీహిల్స్

లోని పెద్దమ్మ తల్లిని దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సాయంత్రం పూర్ణాహుతితో శరన్నవరాత్రులు ముగుస్తాయి. విజయవాడలో ఇంద్రకీలాద్రి జనసంద్రంగా మారింది. కాగా, కృష్ణా నదిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ఈ సాయంత్రం కనకదుర్గమ్మ తెప్పోత్సవాన్ని అధికారులు రద్దు చేశారు. దుర్గఘాట్ వద్ద పూజలు మాత్రమే నిర్వహిస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా రాత్రి పొద్దుపోయేంత వరకు దర్శనానికి అనుమతిస్తామని అధికారులు తెలిపారు. మరోవంక తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఆ సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగుస్తాయి. ఈ ఉదయం మి పుష్కరిణిలో వేంకటేశ్వర స్వామి ప్రతిరూపంగా భావించే చక్రత్తాళ్వార్ కు పవిత్ర స్నానం నిర్వహించారు.

**--డెస్క్, పీటీసీ/హైదరాబాద్**

వరంగల్ దసరా

-వరంగల్ పోలీసు కమిషరేట్ కార్యాలయం ఆయుధగారంలో నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆయుధ పూజ, కార్యాలయం ఆవరణలో శమీపూజ నిర్వహించారు.

--పీటీసీ, వరంగల్ దసరా

పొన్నం...ఎన్నికలు

రాష్ట్రంలో కులగణన పూర్తయిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ కులగణన ప్రక్రియ అరవై రోజుల్లో పూర్తి కావలసి ఉందని చెప్పారు. కాగా, రహదారి నిబంధనలు విధిగా పాటిస్తామంటూ వాహన చోదకులతోఆయన ఈరోజు హుస్నాబాద్ లో ప్రతిజ్ఞ చేయించారు. మద్యం

తాగి వాహనాలు నడపరాదని, అలా వాహనాలు నడపడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

-- పీటీసీ...సిద్ధిపేట./డెస్క్

మూసీ...పునరావాసం

-మూసీ ప్రక్షాళన చర్యల నేపథ్యంలో హైదరాబాద్ మలక్ పేట పరిధిలోని పిల్లిగుడిసెల ప్రాంతవాసులకు జీహెచ్ఎంసీ సహాయకార్యక్రమాలు చేపట్టింది. 29 మంది పిల్లలకు విద్యా సంవత్సరం నష్టపోకుండా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. ఆ కాలనీ ప్రాంతంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసింది.

--పీటీసీ..హైదరాబాద్

వంతెన..శంకుస్థాపన

-ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం లగ్గామ పెంచికలపేట వద్ద పెద్దవాగుపై నిర్మించే వంతెనకు జిల్లా ఎమ్మెల్సీ దండేవిట్టల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఈరోజు శంకుస్థాపన చేశారు.సీఆర్ ఐ ఎఫ్ కింద 18 కోట్ల రూపాయల ఖర్చుతో ఈ వంతెనను నిర్మిస్తారు. అవసరమైతే లోనే మరిన్ని నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

--పీటీసీ....ఆసిఫాబాద్

చిన్నారెడ్డి

-వనపర్తి జిల్లా కేంద్రంలోని చిట్యాలలో చేయూత అనాథ ఆశ్రమం భవననిర్మాణానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఈరోజు భూమి పూజ చేశారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టే వారికి ప్రోత్సాహం అందించాలని, సమాజ శ్రేయస్సు కోసం చేపట్టే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు.

-- పీటీసీ....వనపర్తి

**GOVT-PILLS**

-అత్యవసర గర్భనిరోధక మాత్రల బ్రాండ్ల అమ్మకం, పంపిణీలకు సంబంధించిన నియమాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎప్పటిలానే ఈ మాత్రలను ప్రిస్క్రిప్షన్ లేకుండానే పొందవచ్చని తెలిపింది. కొన్ని హార్మోనల్ గర్భనిరోధక మాత్రలకు ప్రిస్క్రిప్షన్ తప్పనిసరంటూ మీడియాలో వచ్చిన కథనాలపై కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ-CDSCO ఈ మేరకు స్పందించింది.

--ఎన్.ఎస్.డి

వాతావరణం

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఈరోజు, రేపు ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్,వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, జిల్లాల్లో వర్షాలు

కురుస్తాయని, గంటకు సుమారు 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

-- డెస్క్

నిధులు...హరీష్ రావు

-రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను ఇవ్వడంలో కేంద్ర పక్షపాత వైఖరి అవలంబిస్తుండగా, నిధులను రాబట్టడంలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు విఫలమయ్యారని బీఆర్ఎస్ నేత,మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా, ఒక్క రూపాయి కూడా సాధించలేకపోయారని అన్నారు. కేంద్ర బడ్జెట్ లోనూ పొరుగు రాష్ట్రంతో పోల్చుకుంటే అదనపు గ్రాంట్ తగ్గిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపుల పట్ల అభ్యంతరం లేదని, తెలంగాణకు కూడా న్యాయం చేయాలన్నదే తమ డిమాండ్ అని హరీష్ రావు అన్నారు.

--డెస్క్

ఉస్మానియా రిజిస్ట్రార్

సెమిస్టర్ పరీక్షలు, ఉద్యోగాలకు పోటీ పరీక్షలు నిర్వహించే సమయంలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను నిరవధికంగా మూసివేస్తామని ప్రకటించడం అసమంజసమని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ జప్యానికి నిరసనగా ఆయా విద్యాసంస్థలు చేసిన ప్రకటనపై ఆయన స్పందించారు. డిగ్రీ, పీజీ అడమిక్ సెమిస్టర్ పరీక్షలు,

గ్రూప్ ఉద్యోగాల పోటీ పరీక్షలు జరిగే సమయంలో అలాంటి నిర్ణయంతో విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోతారని అన్నారు. కళశాలలను మూసివేస్తే చట్ట ప్రకారం చర్యలుఉంటాయని రిజిస్ట్రార్ హెచ్చరించారు.

-- డెస్క్

శబరిమల

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో దర్శనానికి భక్తులను ఇకపై రోజుకు 17 గంటల అనుమతిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. మండలం మకరవిళక్కు సీజన్ సందర్భంగా తెల్లవారుజామున 3 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని వివరించారు. అయితే భక్తులు ముందుగా ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

(డెస్క్).

Cricket

ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగే మూడవ, చివరి టీ-20 మ్యాచ్ లో భారత్ – బంగ్లాదేశ్ జట్లు తలపడుతున్నాయి. భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ దృష్ట్యా రాచకొండ పోలీసులు ఈ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 11:55 నిముషాల మధ్య ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. లారీలు, డంపర్లు, ఆర్ఎంసి ట్రక్కులు నీటి ట్యాంకర్లు వంటి భారీ వాహనాలను వరంగల్ జాతీయ రహదారి నుంచి చెంగిచెర్ల వైపు వచ్చే భారీ వాహనాలను చెంగిచెర్ల క్రాస్ రోడ్స్ చర్లపల్లి ఎన్ ఎఫ్ సి రోడ్డు వైపు

మళ్ళిస్తున్నారు. అలాగే ఎల్బీనగర్ నుంచి నాగోల్ కి వచ్చే వాహనాలను నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి హెచ్ఎండిఏ బోడుప్పల్ చెంగిచెర్ల క్రాస్ రోడ్స్ వైపు, మల్లాపూర్ నుంచి వచ్చే భారీ వాహనాలను హబ్సిగూడ నుంచి చర్లపల్లి చెంగిచెర్ల వైపు మళ్ళిస్తున్నారు.

-- డెస్క్